క్లుప్తంగా

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి

కొయ్యూరు: పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సీపీఐ మండల కార్యదర్శి ఇరువాడ దేముడు ఆధ్వర్యంలో అంతాడలో మంగళవారం ఆందోళన చేశారు. జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే ధరలు తగ్గుతాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లి సత్యనారాయణ, గిరిజన సమాఖ్య మండల ప్రధాన కార్యదకర్శి పి.ధారమల్లేశ్, మాజీ సర్పంచ్ రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుకోసం ఆశా వర్కర్ల ధర్నా


ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

కొయ్యూరు: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రపాలెం ఆస్పత్రి ఆవరణలో మంగళవారం ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత వై. అప్పలనాయుడు మాట్లాడుతూ గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం వారి వేతనాలను పెంచాలని, సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం నాయకులు ఆమూరి దేముడమ్మ, సావిత్రి,రత్న కుమారి, సరోజిని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు, పుస్తకాల పంపిణీ


పలకలు పంపిణీ చేస్తున్న సాల్మన్

అరకులోయ రూరల్: వర్క్ ఆఫ్ క్రైస్ట్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఒడిశా రాష్ట్రం కోరాపుట్టు జిల్లా బడెల్‌లో 37 మంది విద్యార్థులకు పెన్నులు, పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్టు ఆ సంస్థ డైరెక్టర్ తెలగంజి సాల్మాన్(దాసు) తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, హుకుంపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసినట్టు ఆయన చెప్పారు.

చింతూరులో డెయిరీ ఏర్పాటుకు వినతి

చింతూరు: పేదరైతులు పాలు అమ్ముకునేందుకు గాను చింతూరు కేంద్రంగా డెయిరీ ఏర్పాటుకు చేయాలని బీజేపీ నాయకులు పాయం వెంకయ్య, రమణారెడ్డి, ముత్తయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం వారు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెయిరీ ఏర్పాటు వల్ల నాలుగు మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన పేద రైతులకు ఎంతోమేలు చేకూరుతుందని తెలిపారు. పలు సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

అక్రమ సాగుదారులపై చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న జల్లి నరేష్

చింతూరు: ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా అక్రమంగా జామాయిల్ సాగుచేస్తున్న వలస గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ డిమాండ్ చేశారు. చింతూరులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాల్లో వలస గిరిజనేతరులు తక్కువ ధరకు కౌలు పేరుతో పొలాలు తీసుకుని జామాయిల్ సాగు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శీలం తమ్మయ్య, సోడె శ్రీహరి, కొండ బాబు, శివయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

ఊట నీరే దిక్కు

- భూసిపుట్టు పంచాయతీలో తాగునీటి కష్టాలు
- రక్షిత జలం లేక ఏడు గ్రామాల ప్రజలకు ఇక్కట్లు


ఊట నీటిని సేకరిస్తున్న కొమ్ములుకొండ గిరిజన మహిళలు


నీటిని మోసుకొని వెళుతున్న గిరిజన మహిళలు

ముంచంగిపుట్టు: మండలంలోని భూసిపుట్టు పంచాయతీలో ఏడు గ్రామల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి పథకాలు పని చేయకపోవడంతో కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లి కలుషితమైన ఊటనీటిని తెచ్చుకుని వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో నీటి కోసం గిరిజనులు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. భూసిపుట్టు పంచాయతీలో కొమ్ములుకొండ, బొర్రపనస, దొరగూడ, సుల్తాన్‌పుట్టు, మల్లెపుట్టు, నేరొడుపుట్టు, దోనిపుట్టు గ్రామాల్లో 251 కుటుంబాలకు చెందిన 916 మంది గిరిజనులు తాగునీటికోసం అవస్థలు పడుతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా కనీస స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊటనీరును తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని వాపోయారు. వర్షకాలంలో వరదనీరు... ఊట నీటితో కలిసిపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నామని చెప్పారు. ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా అధికారుల్లో చలనం లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరారు. ఆదివాసీలను పట్టించుకునే నాథుడే కరవవుతున్నాడు. దీంతో పలు సమస్యలతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. రక్షిత మంచినీటి పథకాలు పనిచేయకపోవడంతో ఊటగెడ్డలపై ఆధారపడుతున్నారు. ఆ నీరు కలుషితమైంది కావడంతో వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, అతిసార తదితర వ్యాధులకు గురవుతున్నారు. రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని పలు గ్రామాల ప్రజలు పాలకులను, అధికారులను కోరుతున్నారు.

నిత్యం అవస్థలు

తాగునీటి కోసం నిత్యం అవస్థలు పడుతున్నాం. ఊటనీరే దిక్కుగా ఉంది.కలుషిత నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నాం. నీటి సమస్యను తీర్చాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన సమస్యను పరిష్కరించాలి.

– పి.సుకదేవ్, మల్లెపుట్టు గ్రామం,భూసిపుట్టు పంచాయతీ

ప్రతిపాదనలు పంపాం

భూసిపుట్టు పంచాయతీలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాం. రక్షిత పథకాల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

– సాయికృష్ణ, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ముంచంగిపుట్టు

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్ కుమార్



నిరుద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ప్రశాంత్‌కుమార్, వేదికపై సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో మంగళవారం జిల్లా ఉపాధి కల్పన నైపుణ్యాభివృద్ధి సంస్థ,సీడాప్ సంయుక్తంగా మెగా జాబ్ మేళా నిర్వహించాయి.అపోలో ఫార్మా, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, ముత్తూట్ ఫైనాన్స్, మోడరన్ వీర్ సెక్యూరిటీ సర్వీస్ తదితర కంపెనీల్లో ఉద్యోగాల కల్పన కోసం నిర్వహించిన జాబ్ మేళాలో 142 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వీరిలో 52 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అరకులోయ సీఐ హిమగిరి మాట్లాడుతూ గంజాయి,డ్రగ్స్, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. యువతకు ఎటువంటి సహాయసహకారాలు అవసరమైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి సంగీత, సీడాప్ ప్రతినిధి భారతి, ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి


జి.మాడుగులలో ఆందోళన చేస్తున్న వలంటీర్లు

జి.మాడుగుల: గ్రామ వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు నెలలు బకాయి వేతనాలు చెల్లించాలని, రూ.10వేలు వేతనంగా చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్ డిమాండ్ చేశారు. వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రం జి.మాడుగులలో మంగళవారం వలంటీర్ల సంఘం నాయకుడు చంటిబాబు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ధర్మన్న పడాల్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ప్రసాద్, మండల అధ్యక్షుడు టి.శోభన్, కార్యదర్శి రాజండొర, పాడేరు మండల అధ్యక్షుడు సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంటిబాబు, తిరుపతి, కృష్ణవేణి,మత్స్యకొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సత్యారావు

పెదబయలు: ఎపిడమిక్ సీజన్‌లో గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రూడకోట పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సత్యారావు అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జ్వరాలు అధికంగా ఉంటే వెంటనే వైద్యాధికారి దృష్టికి తీసుకొస్తే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్లు లేని, గెడ్డలు దాటాల్సిన గ్రామాల్లో గర్భిణులను ప్రసవానికి రెండు వారాలు ముందుగానే ఆస్పత్రికి తరలించాలని, ప్రతి నెల 9 తేదీన జరుగుతున్న పీఎంఎస్ఎంఏ డే నాడు పీహెచ్‌పీ పరిధిలోని గర్భిణులందరినీ చెకప్‌కు ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూలు తీసుకురావాలన్నారు. ఈ నెల 17న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించి అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో రూడకోట సర్పంచ్ కాతారి సురేష్‌కుమార్, ఎంపీహెచ్ఈవో బింగురాజు, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు,సీహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు అభినందనలు

గంగవరం : ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కంగల పోసియ్య, శీరసం పోతురాజు దొరలకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు లభించడం పట్ల మండలానికి చెందిన పలువురు ఆదివాసీ నాయకులు అభినందనలు తెలిపారు. కుంజం సత్యవతి, మొల్లేరు సొసైటీ మాజీ డైరెక్టర్ పండా సిద్ధార్థ దొర, కె.సిద్ధు , కె. వెంకటేశ్వర్లు దొర తదితరులు అభినందనలు తెలిపారు.

పక్కాగా పౌష్టికాహారం పంపిణీ


గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

చింతపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పక్కాగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని చింతపల్లి మండల సీడీపీవో రామలక్ష్మి అన్నారు. మండలంలోని సిరిపురం, కృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. స్టాళ్లను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ మహిళ పోలీసులు పాల్గొన్నారు.

4,200 హెక్టార్లలో వరి సాగు


సీకరిలో వరి పొలాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్

పెదబయలు: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 4,200 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. సీకరి పంచాయతీలో వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వరి పిలకలు వేసే దశలో ఉందని, ఆకుముడత పురుగు ఉధృతిని గమనించినట్టు చెప్పారు. దీని నివారణకు వేపాకు కషాయం పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వరి చేనులో పోషకాల క్షీణత కనిపిస్తోందని, దీని నివారణను ద్రవ రూప జీవన ఎరువులు వినియోగించాలని తెలిపారు. వీటిని 50 శాతం రాయితీతో రైతులకు అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీకరి సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి


మొంజాపుట్టులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి ఎం.శ్రీనివాసబాబు అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా జోలాపుట్టు పంచాయతీ మొంజపుట్టులో రైతులకు మంగళవారం సేంద్రియ,ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసబాబు మాట్లాడుతూ గిరిజన రైతులు పురుగు మందు వాడకంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఆనంద్, వీహెచ్ఏ మోహన్,వ్యవసాయ,ప్రకృతి వ్యవసాయ శాఖాల సిబ్బంది,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

చింతూరు సీఐ దుర్గాప్రసాద్



చింతూరు: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసే గణేష్ మండపాల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. వేడుకల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని, బలవంతంగా చందాల వసూళ్లు చేయరాదని, దర్శనాలకు టికెట్లు పెట్టకూడదని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారుచేసిన విగ్రహాలను వినియోగించాలని, ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైకులు వినియోగించాలని, మండపాల వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సీఐ సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని ఆయన తెలిపారు.

నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం అవసరం


కిలగాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం రావలసిన అవసరం ఉందని కిలగాడ వైద్యాధికారి ఎస్.రమేష్ అన్నారు.మండలంలోని కిలగాడలో మంగళవారం వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ మరణించిన తర్వాత నేత్రదానం చేయడం వల్ల అంధులకు ప్రపంచాన్ని చూడగలిగే భాగ్యం కల్పించిన వారమవుతామన్నారు. నేత్రదానంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఆప్తామాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్,ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం,కిలగాడ వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం : మరణానంతరం నేత్రదానం చేసి మరొకరికి చూపును ప్రసాదించడం ఎంతో గొప్ప విషయమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భావన అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి భావన ఆధ్వర్యంలో 39వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కంటి వైద్యులు ఏసు పాదం మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. ఎంపీహెచ్ఈఓ ప్రసాద్, గంగవరం, పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

విశాఖ పారిశ్రామికవాడలో 'గిరి విజ్ఞాన యాత్ర'


కొయ్యూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లోకేష్‌కుమార్

కొయ్యూరు: ఐటీఐ,డిప్లమో,ఏదైన డిగ్రీ చదవిన గిరిజన విద్యార్థులకు గిరి విజ్ఞాన యాత్రలో భాగంగా విశాఖ పారిశ్రామిక వాడలోకి అవగాహన కల్పించనున్నట్టు మంప ఎస్ఐ లోకేష్‌కుమార్‌తెలిపారు. కొయ్యూరులో మంగళవారం ఆయన స్థానికులతో మాట్లాడారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు తమను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల మొదటి వారంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పూర్తి వివరాల కోసం 9440904218, 9440904217 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సభ్యులు

డుంబ్రిగుడ: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మంగళవారం కిల్లోగుడ పీహెచ్‌సీతో పాటు కిల్లోగుడ, సాగర గ్రామాల్లో ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా లింక్ వర్కర్ స్కీమ్ సీఎల్‌డబ్ల్యూ కె.శరభయ్య మాట్లాడుతూ నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) నేతృత్వంలో రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సొంబ్రు, ఏఎన్ఎం కమల కుమారి ఆశవర్కర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


కించాయిపుట్టులో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: దోమలతో వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, అందువల్ల వాటి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు అన్నారు. కించాయిపుట్టులో దోమల నివారణ కోసం మంగళవారం ఫాగింగ్ చేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి ఉండడంతో దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిలగాడ వైద్యాధికారి రమేష్,వైద్య సిబ్బంది అశోక్,ప్రదీప్ పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'కి నిధుల మంజూరుకు కృషి


అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్

చింతపల్లి: కప్పల అంగన్‌వాడీ కేంద్రం భవనం మరమ్మతులకు నిధుల మంజూరయ్యేలా కృషి చేస్తానని జెడ్పీటీసీ పి.బాలయ్యపడాల్ తెలిపారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ముందుగా భీమసింగిలో పాఠశాలను సందర్శించి విద్యాబోధన, మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరు పరిశీలించారు. అనంతరం కప్పల అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయిన కోడి గుడ్లను పరిశీలించారు. సర్పంచ్ బన్నిబాబు, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు పాల్గొన్నారు.

'డీఎస్సీ కోచింగ్' అభ్యర్థుల మెరిట్ లిస్టు సిద్ధం

రంపచోడవరం: డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితాను సిద్ధం చేసినట్టు ఐటీడీఏ అధికారులు తెలిపారు. మెరిట్ లిస్టును ఐటీడీఏ నోటీసు బోర్డు, రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉంచినట్టు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జాబితాను చూసుకోవాలన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని అరకులోయ సీఐ హిమగిరి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పరివర్తన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవగాహన లేకపోవడం వల్ల తప్పుడు మార్గంలో వెళ్తూ విద్యార్థులు పలు కేసుల్లో ఇరుక్కుంటున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో డుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు

చింతూరు: వీఆర్‌పురం మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు మంగళవారం ఎంపీడీవో ఫణీంద్రకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలు వచ్చే అవకాశమున్నందున ముందస్తుగా సహాయక చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ రహదారులను పూర్తి చేయాలని కోరారు. అన్నవరం వాగుపై మంజూరైన వంతెన నిర్మాణం చేపట్టాలని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్యాల భవానీ, ఎంపీటీసీలు బంధం విజయలక్ష్మి, మిడియం రమాదేవి, సర్పంచ్‌లు పిట్టా రామారావు, సోడె నర్సమ్మ, మూట్ల బాలరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి


విద్యార్థులకు భోజనాలు అందజేస్తున్న హెచ్ఎం మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు హెచ్ఎం మాణిక్యాలరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–1లో మంగళవారం ఉపాధ్యాయులు పారిశుధ్యంపై డ్రైవ్ నిర్వహించారు. మరుగుదొడ్లు శుభ్రం చేయించడంతో పాటు పాఠశాల,వసతి గృహం పరిసరాల్లో బ్లీచింగ్ వేయించారు. మెనూ ప్రకారం భోజనం అందజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ భోజనం చేసేందుకు ముందు చేతులు,కాళ్లు శుభ్రంగా నీటితో కడుగుకోవాలని సూచించారు. వార్డెన్ ధనుంజయ్, ఉపాధ్యాయులు మధుసూదన్, భాగత్‌రాం,గిరీష్ పాల్గొన్నారు.